


కొన్నేళ్లనుంచీ నా కేదో కారు ఉంటూనే ఉంది. అది ఎటొచ్చీ ఎప్పుడూ పాత కారు మాత్రం అయి ఉంటుంది. నేను నెలకో రెణ్ణెల్లకో కారు మారుస్తూ ఉంటాను. కారు కొనడం ఏమిటి, దాని రూపురేఖలన్నీ మార్చేయడం ఏమిటి? నిజానికి దాన్ని తిరగతోడేస్తాను - తిరిగి తయారు చేస్తాను. పురుగు పుట్రా తినేసిన చోట రంగు కూడా పూసేస్తాను. మళ్లీ దాన్ని అమ్మకానికి సిద్ధం చేస్తాను. కారుకూడా జుట్టు రంగులూ, ఫేస్ పౌడర్లూ, లిప్ స్టిక్కులూ ఉంటాయి కదా! కొన్న మొదటిరోజునే కారు ఇంటి వెనక దొడ్లో పెడతా. గంటలకొద్దీ దాని కింద పడుకుంటాను. ఎందుకూ? రెంచీలూ అవీ పట్టుకుని చిల్లర మరమ్మతులూ అవీ చేసిపారేసి అప్పటికి కాస్త నడిచేటట్టు చేస్తా. అందుచేత నా జీవితంలో ముప్పాతిక మువ్వీసం, అంటే మెళుకువగా ఉన్నంతసేపూ, కారుకిందనే కాలక్షేపం చెయ్యడం అలవాటైపోయింది. నే నెక్కడికైనా వెళ్ళవసి వచ్చిందో, మోటారు చికిత్సా యంత్ర పరికరాలతో ఒక గోనెపట్టా నాతోకూడా ప్రయాణం చేస్తుంది. ఏదైనా అవాంతరం వచ్చేసరికి ఆ కారు కింద గోనెపట్టా పరిచి, కారుకిందదూరి, దానిమీద పడుకుంటాను. అలాగ ఇక అధోలోకంలోకి వెళ్లిపోయాక సర్వం మరిచిపోతాను. ఒక్కొక్కప్పుడు కారుకింద పడుకుని ఉండడం చూసి దారిపొయ్యేవాళ్లు కారుప్రమాదానికి గురిఅయిన మందభాగ్యుణ్ణనుకుని

యస్. యస్. శివస్వామి




# కారు కొనిచూడు

పోలీసుల్ని పరుగెత్తి పిలుచుకురావడం కూడా ఉంది. ఇలా కారుకింద పడుకోడం ఎంత అలవాటయిందంటే ఇప్పుడు దేనికిందనైనా హాయిగా పడుకోగలను. రాత్రి పడుకునేటప్పుడు అసలు మంచంకిందకి దూరడమే అలవాటైపోయింది. పొరుగూళ్ళల్లో నేను దిగే హోటలు వాళ్ళు కూడా నాకోసం మంచంకిందనే నా పక్క పరుస్తారు.

నా మాత్రం అనుభవం లేనివాళ్లకి నాదొక సలహా. పొరపాటున 1920 కి పూర్వపు కారు కొనకండి. 20 వదో, 21 టిదో కొనాలనుకున్న వాళ్ళకి మాత్రం బోలెడంత అనుభవమైనా ఉండాలి - మాంచి ధైర్యసాహసాలైనా ఉండాలి. ఎందుచేతనంటే తీరా కొన్నతరవాత కారు నడిపించనూలేక, అమ్మివొదుల్చుకోనూ లేక గట్టి చిక్కులో పడతారు.

అయితే అలాంటి కారే అమ్మడానికి నీదగ్గిరకొకానొకడొచ్చాడనుకో. నిన్ను మొహమాట పెడతాడనుకో. ఆ కారు పుష్పక విమానమనీ, అర్జునుడి రథమనీ అతిశయోక్తులు తెగ పొగుడుతాడనుకో. వాణ్ణి చిత్తు చెయ్యడానికి రెండు పద్ధతులున్నాయి. నేను రహస్యంగా చెపుతున్నా. వాడు చెప్పేదంతా కళ్లుమూసుకుని కదలకుండా విను. తరవాత ఈ ఒక్క మాటతో వాణ్ణి భూశయనం చెయ్యి. ఏమిటది ? "అయ్యా! నువ్వు చెప్పిందంతా నిజమే. ఆ కారుకటువంటి ఉత్తమ లక్షణా లన్నీ ఉన్నాయి.



అయితే నువ్వు కొన్నవాడి కాకారు నేనే అమ్మాను'' అని. లేక ఇంకో పద్ధతి. వాడి సంభాషణలో నువ్వు కలియడం. అడుగడుగునా వాడికి ఎదురుతిరిగి ఊపిరాడనివ్వక పోవడం. ఎలా అంటే ఇలా ఉండొచ్చు ఆ సంభాషణ.


అతడు "చూడండీ. ఇదికొని సంవత్సరంన్నర అయింది. ఒక్కసారైనా, ఒక్క పైసా అయినా ఇంతవరకూ గారేజ్ వాళ్ళకి మరమ్మత్తుకోసం ఇవ్వలేదు.'' నువ్వు "భేష్! బలే! నిజమే! అవును. విన్నా. ఆ గారేజ్ వాడు చెప్పాడు నాతో. అయినా, పాపం, వాడికి పారెయ్యకూడదూ ఆ మరమ్మత్తు చార్జీ?''

లేక.

వాడు "ఓ. ఏమికారండీ! ఏమి కారండీ!! ఇది సెకండు హేండు కారు కొన్నానంటే ఎవరైనా నమ్ముతారా?" నువ్వు ''నమ్మరు. ఎందుకు నమ్ముతారు? నేను నమ్ముతానా? మీరే స్వయంగా ఇంటిదగ్గిర తయారు చేసిన కొత్తకారనుకున్నాను గాని."

ఈ ధోరణిలో వాడితో వాక్యప్రతి వాక్యాలు సాగించావంటే వాడు తన తెలివితేటలు కట్టిపెట్టుకున్నవాడై, నువ్వు లాంగే బాపతు కావని తెలుసుకున్నవాడునై, నీకుకూడా తెలియకుండా అంతర్ధానం అవుతాడు.


ఇహ-నువ్వు కారుకొనడానికి ఉద్యుక్తుడవు అయేముందు నువ్వొక గడ్డుసమస్య ఎదుర్కోవలసి వస్తుంది. కారు ముందుగా ఎలా పరీక్ష చెయ్యడమా అన్నది? నేనే అయితే పరీక్ష చెయనేచెయ్యను. నేను ఇక్ష్వాకుల నాటి కారులే కొంటాను కనక. ఒక్కసారి ఊరికే ముందు బోయెనెట్ ఎత్తి చూస్తాను అంతే. దానిలో ఇంజెన్ ఉందా లేదా అని. (ఎప్పుడైనా వెనక డిక్కీకూడా ఎత్తిచూస్తా. అదెందుకో అనుభవంమీద తెలుస్తుందిలే).






కారు ఇతర భాగాలన్నిట్లోనూ ఏదో లోపం ఉండితీరాలికదా! చిల్లర మరమ్మతులూ, అతుకులూ, కుట్లూ అవసర మవ్వేవి. విరిగిపోయిన భాగాల్ని తాళ్లతోనూ, తీగెలతోనూ కట్టి ఉంచుతా రొకప్పుడు. ఎన్నో తుమ్మజిగురు, చింతఅంబలీ పెట్టి అంటిస్తారు. మ్చ.మ్చ. ఇవి మామూలు. అయితే ఇక్కడ నేను ఒక ముఖ్యమైన సలహా ఇవ్వాలి, తప్పదు. వయసు మళ్లి పళ్లూడిన కారు నువ్వు కొనదలచుకొన్నావో — అంటే ముఖ్యంగా దవడ దడదడ లాడేదీ — ముందుగా నువ్వొక పని చెయ్యాలి. చెక్కరాలమీద ఒక చూపు విసిరెయ్యాలి. ఎందుకంటావా? టైరల్లో ట్యూబ్‌లకు బదులు గడ్డి కుక్కి ఉంచవచ్చు. అలా చూడవనుకో, కారు నడుస్తుందనుకో. దడ దడ లాడదు. ఇహ కారు చెప్పలేని చప్పుళ్లూ, గడబిడా చేస్తుంది దీపావళి రాత్రిలాగ.

ఇహ ఎవడైనా నిన్ను మొహమాట పెట్టి కారు కొనిపించాడనుకో. ఓం ప్రథమంగా నువ్వు చెయ్యవలసిందీ, కారుముందు ఇనపకొక్కాం గుచ్చడం. దానికి తాడుగట్టి లాగడానికి వీలుగా. కొనగానే నీ ఇంటిదాకా ఎలాగా నడుస్తుందనుకో. కాని తరవాత భీష్మించుకు కూచొని ఒక అంగుళం కదలదు. అప్పుడు కార్ఖానాదాకా లాగడానికి తాడొద్దూ? వెనకనుంచి తొయ్యడానికి ఇద్దరు ఆసాములను కుదుర్చుకోవచ్చు అనుకో. వాళ్లకి ఏం కూలి ఇవ్వాలో ముందే నిశ్చయిం





చుకో. వాళ్లు అన్యాయంగా ఎక్కువ అడగవచ్చు. ఏం జేస్తావూ? ఒప్పుకో. ఒప్పుకుని వాళ్ల సరదా తీరేటట్టూ తగినంత పనిచెప్పు. ఎలాగ? సరియైన టైములో వాళ్లు కారు తోసేటప్పుడు, బ్రేక్ పెడల్ నొక్కుతూండు.

ఇంకో సలహా ఉంది. అన్నిటికన్న ముఖ్యమైంది. నువ్వు కార్లో బయలు దేరి వెడుతున్నప్పుడు చురచురలాడే ఎండలో బస్‌స్టాపు దగ్గిర నిలబడ్డ ఆసామీ ఎవరైనా ఉంటే ఎక్కించుకో. కారు కొంతదూరం నడిచాక ఇతగాడు పనికొస్తాడు — సమయానికి త్రోపుడు కూలీలు దొరక్కపోవచ్చు కనక.

మనమే ఒక పాతకారు, అంటే నీ డొక్కుని అమ్మడానికి తిరిగేటప్పుడు దాని గుణగణాలు పొగడకు. నువ్వు కారు మెయిన్‌టైన్ చెయ్యలేవు — అని ఎంతమాత్రం పైకి పొక్కనీకు. అలా పొక్కనిచ్చావో కొనబోయేవాడు ఆ కారుతోపాటు కాస్త రుసుముకూడా నీ దగ్గిరనుంచి రాబట్టటానికిచూస్తాడు.

వాటి నుదుటిమీద ఏం రాసిఉందో కాని కొన్ని కార్ల జీవితయాత్ర ఒకే ఒకవిధంగా ముగుస్తుంది. ఆ కార్ని నీ ఇంటిముందు నిలబెట్టు, లేక నీ పెరట్లో పాతెయ్యి, దానిచుట్టూ గడ్డీ, పొదలూ పెరుగుతాయి. కొన్ని ఏళ్లు అయాక దానికి తుప్పు పడుతుంది. మరికొంత కాలానికి దానికింద ఒక పుట్ట లేస్తుంది. మంచిరోజు చూసి నాగ ప్రతిష్ఠకూడా చేసుకోవచ్చు.

అలాంటి చిక్కు రాకండా నీ కారును వొదుల్చుకుందుకి ఒకపన్నాగం ఆలోచించాలిగా. నాకు ఒక్కటి మంచిది తోస్తుంది దాన్ని వొదుల్చుకుందుకి. ఊరికే పట్నం అవతలికి షికారుగా బయలుదేరు కారులో. ఆక్ట్రాయ్ పోస్టు దగ్గిరకో, తోలుగేటు దగ్గిరకో వస్తావు. అక్కడ పన్ను అడిగే వాడు నిన్ను ఆపుతాడు. నీ కారు చుట్టూ ఒకటిరెండుసార్లు ప్రదక్షిణం



చేసి రూపాయిన్నర అంటాడు. నువ్వు తక్షణం కారులోంచి దిగు. నీ చిరునామా వాడికియ్యి. ఆ రూపాయిన్నరా నీ ఇంటికి మనియార్డరు పంపమని చెప్పి చల్లగా వెన్నక్కి తిరిగిపో.

ఇవన్నీ ఒక ఎత్తు. తుంటరులైన వదరుబోతుల్ని తట్టుకోడం ఒక ఎత్తు. ఎక్కువగా చాలాభాగం తోయడం వల్ల నీ కారుకి పెట్రోలు అంతగా అవసరం లేకపోవడంవల్ల నువ్వు అదృష్టవంతుడవనిన్నీ, నీకారు నడిచేటప్పుడు అది నీ మాట వినక వీళ్ల మీదా వాళ్లమీదా ఎక్కడంవల్ల నువ్వు భూభారం తగ్గించడానికి పుట్టిన అవతారమూర్తి వనిన్నీ, నీకార్లో హారన్ తప్ప ఇతర భాగాలన్నీ కలిసి ఒకేసారి రొదచేయడంవల్ల దూరాన్నుంచే పసికట్టి ప్రాణికోటి తప్పకుండా ఆత్మరక్షణం చేసుకోడానికి అవకాశం నీవే అనుగ్రహిస్తున్నావనిన్నీ ఆ పలువలు కారుకూతలు కూస్తారు. నువ్వు పట్టించుకోకు.

★

